క్లుప్తంగా

ఆలయ జీర్ణోద్ధరణకు రూ. లక్ష విరాళం



నగదు అందజేస్తున్న మిత్రమండలి సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని పాటిమీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కోవెలకుంట్లకు చెందిన ప్రవాసాంధ్రుడు, అమెరికా డాక్టర్ గురురాజ రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు విరాళం మొత్తాన్ని డాక్టర్ మిత్రమండలి సభ్యులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు జగన్నాథరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, రామ సుబ్బారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పవన్ శ్రీనివాసరెడ్డి, అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా గుడి నిర్మాణానికి...

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన నిర్మిస్తున్న శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయం నిర్మాణానికి దాతలు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. పట్టణానికి చెందని మైన్‌ఓనర్ కొండా సురేష్, ఉషారాణి దంపతుల కుమార్తె, అల్లుడు మౌనిక, కాకర్ల అజయ్‌కుమార్ పంపిన నగదును గురువారం ఆలయ కమిటీ సభ్యులు భాష్యం రమణగౌడ్, శ్రీరాములు, రామచంద్రరావ్, జమరామ్, మోహన్‌రెడ్డికి వారు అందజేశారు.

సిటిజన్ సర్వే వంద శాతం పూర్తి చేయాలి

కొలిమిగుండ్ల: సిటిజన్ ఔట్ రీచ్ సర్వే మండలంలో వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో సచివాలయ మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి రోజు ఆయా సచివాలయాల్లో ఉద్యోగులు బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ వేయాలన్నారు. ఎస్డీజీ సర్వేలో భాగంగా గర్భిణులు, 0–5 ఏళ్ల లోపు చిన్నారులు, 6–19 ఏళ్ల లోపు పిల్లల వివరాలు సేకరించాలన్నారు. మండలంలో 36 శాతం మాత్రమే సర్వే పూర్తి చేశారని, వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

28లోపు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కావాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియ ఈ నెల 28కంతా పూర్తికావాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం 1, 2వ గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంకా కొంత మంది రైతులు పంటల నమోదుకు సంబంధించి ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. వ్యవసాయరంగంలో వివిధ పథకాల వర్తింపునకు ఈక్రాప్ ప్రామాణికమన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం సంభవిస్తే నష్టపరిహారం, పంటలబీమా, పంట ఉత్పత్తుల కొనుగోలు తదితర రాయితీలు ఈ క్రాప్ ఆధారంగా వర్తింప చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ బాలాంజనేయులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోవాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సూచించారు. గురువారం మేజర్ గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలతోపాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, కడ్డీలు, గృహ నిర్మాణ సామాగ్రి అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాత ఇల్లు దగ్ధం

అవుకు: మండలంలోని చెన్నంపల్లెలో పశువులు ఉంచిన ఓ పాతఇంటిలో గురువారం మంటలు చెలరేగి రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు చిన్నగొల్లా రెడ్డి గారి చెన్నకేశవరెడ్డి తన రెండు పాడిగేదెలను పాత ఇంటిలో ఉంచి పశుపోషణ చూసుకునేవాడు. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో పశువులను కట్టిఉంచిన ప్రదేశంలో పొగపెట్టి వెళ్లాడు. ఆ పొగ కాస్త పెద్దదై దంతెలకు, అక్కడే ఉన్న డీజిల్ క్యాన్‌కు మంటలు వ్యాపించాయి. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమవుతుండడంతో బాధిత రైతుల ఫైర్‌ఇంజిన్‌కు సమాచారం అందించాడు. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే మంటల్లో చిక్కుకొని రెండు పాడిగేదెలు మృతి చెందాయి. ట్రాక్టర్ సామగ్రి కాలిపోయింది.

అభివృద్ధి పరుగులు!

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనకు రూ. 2,549 కోట్లు
- నియోజకర్గంలో 4,32లక్షల మందికి చేకూరిన లబ్ధి రూ. 994 కోట్లు



బనగానపల్లె పట్టణంలో రూ.4 కోట్లతో చేపట్టిన ఫోర్‌లైన్స్ రోడ్డు



రూ.1.20కొట్లతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బనగానపల్లె నియోజకర్గం అభివృద్ధి పరుగులు తీస్తుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యం మేరకు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం నిర్ణయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే పకడ్బందీగా కార్యాచరణ రూపొందించుకుని పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ జనాభా దాదాపు 3.06లక్షలు ఉండగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పన చేపడుతన్నారు ఎమ్మెల్యే కాటసాని. ప్రత్యేకించి రహదారులు, డ్రైనేజీలు, నీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2,549 కోట్లతో 2,110 అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని ఇప్పటికే పూర్తవ్వగా మరి కొన్ని వివిధ దశల్లో సాగుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా 4.32 లక్షల మందికి రూ. 994 కోట్లు లబ్ధి చేకూరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన ప్రతి కుటుంబానికే కాదు... ప్రతి కుటుంబ సభ్యునికి పరోక్షంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరినట్లు ఇట్టే అర్థమవుతుంది కూడా.

మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధికంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతినుస్తుందనేందుకు నియోజకర్గంలో జరిగిన... జరుగుతున్న అభివృద్ధి పనులు.. మంజూరైన నిధులు ప్రత్యక్ష సాక్ష్యం. పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 219 కోట్లు, ఆర్‌డబ్ల్యూ నుంచి రూ. 128 కోట్లు, ఆర్అండ్‌బీ నుంచి రూ.204 కోట్లు, జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనుల కోసం రూ.739 కోట్లు, అవుకు టన్నెలుకు రూ.358 కోట్లు, అవుకు రిజర్వాయర్ నుంచి పెద్దవెంతుర్ల వరకు జీఎన్ఎస్ కాల్వ వెడల్పు కోసం రూ.295 కోట్లు మంజూరైనట్లు తెలిసిందే. అదేవిధంగా తెళ్లపూర్ నుంచి కుందూనది వెడల్పుకురూ. 200 కోట్లు,జొలదరాశి రిజర్వాయర్‌కు రూ. 312 కోట్లు, మైనర్ ఇరిగేషన్‌కు రూ.2.49కోట్లు,ఎన్ఆర్ఈజీఎస్ రూ. 124 కోట్లు, జలకళ పథకం ద్వారా బోర్లు వేయుటకు రూ. 7.19 కోట్లు, మైనార్టీల వెల్ఫేర్ కు రూ. 48లక్షలు, ఆసుపత్రుల నిర్మాణానికి రూ.29 కోట్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికిరూ.5.17 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని పూర్తవ్వగా మరికొన్ని వివిధ దశల్లో సాగుతున్నాయి. ప్రధానంగా పట్టణంలో కొత్తబస్టాండ్ రోడ్డులో రూ. 4 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సౌకర్యంతో చేపట్టిన నాలుగు రోడ్ల నిర్మాణం పనులు చురుగ్గాజరుగుతున్నాయి.

సాగునీటి సౌకర్యం..

బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 74వేల ఎకరాల ఆయకట్టుకు ఎస్ఆర్‌బీసీ ద్వారా ప్రతి సంవత్సరం ఖరీఫ్,రబీ రెండు పంటలు సాగునీటి సౌకర్యం లభిస్తుంది.దీంతో వరి, మొక్కజొన్న మిరప, ఆముదం ,మరిన్ని వాణిజ్య పంటలను ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు త్వరలో పూర్తికానున్నందున మరింతసాగునీటి సౌకర్యం లభించే అవకాశం ఉంది.జోలదరాశి రిజర్వాయర్ నిర్మాణపనులు పూర్తయితే తాగు, సాగునీటి సమస్యతీరుతుందని గ్రామీణులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.జిల్లాలో ఎక్కడాలేనంతగా నియోజకవర్గంలో సుమారు 25వేల వ్యవసాయబోర్ల ద్వారా లక్షఎకరాల ఆయకట్టుకు సాగునీరు లభిస్తుంది.

పారిశ్రామిక అభివృద్ధి...

జిల్లాలో ఎక్కడలేని విధంగా నియోజకవర్గంలో గణనీయంగా పారిశ్రామిక అభివృద్ధి చెందుతుంది. జయజ్యోతి,ఎల్అండ్‌టీ, రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నాపరాతి మైనింగ్ గనులు పాలిష్ ఫ్యాక్టరీలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. వీటీ ద్వారా సుమారు 20 వేల మంది కార్మికులు, ఉపాధి పొందుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో ప్రీజం సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుండగా నందిపాడు వద్ద సుమారు 3వేల కోట్లతో విద్యుత్ స్టోరేజ్ చేసేందుకు పవర్‌గ్రిడ్ ఏర్పటుకు అధికారులు సన్నహాలు ప్రారంభించారు.

మండలాల వారీగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	మొత్తం కోట్లలో
బనగానపల్లె	1,08,006	326.51
అవుకు	96,199	188.23
కోవెలకుంట్ల	83,922	120.46
కొలిమిగుండ్ల	90,709	208.02
సంజామల	53,098	150.84

అభివృద్ధే ధ్యేయంగా



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. అవసరమైన అభివృద్ధి పనులను గుర్తిస్తూ వాటికి నిధులను మంజూరు చేయిస్తున్నారు. అభివృద్ధి పనుల నిర్మాణ సమయంలో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షిస్తున్నారు. రానున్న రోజుల్లో నియోజకర్గం అన్నిరంగాల్లో ముందంజ ఉంటుంది.
– మానసవీణ, ఎంపీపీ, బనగానపల్లె మండలం

గతంలో లేని అభివృద్ధి



గతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి ప్రస్తుతం జరుగుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి చేపడుతున్నారు ఎమ్మెల్యే కాటసాని. ప్రతి గ్రామాన్ని సందర్శించడంతోపాటు సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతున్నారు.–జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు, బనగానపల్లె

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాల మేరకు తమవంతుగా పేదల అభివృద్ధి పాటుపడుతున్నాం. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. ప్రజల సమస్యలు తెలుసుకుని పరి ష్కరిస్తున్నాం. అర్హులందరికీ పథకాలు అందజేసేలా సచివాలయ ఉద్యోగులను చైతన్య పరుస్తున్నాం. – శివరామయ్య, ఎంపీడీఓ, బనగానపల్లె

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జమ్మలమడుగు చౌరస్తా సమీపంలోని వెంకటరమణ కాలనీలో వెలసిన అష్టలక్ష్మి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాగణపతి, నందీశ్వర, విశాలాక్షి, సంకల్పస్ఫటిక లింగ కాశి విశ్వేశ్వరస్వామి, దత్తాత్రేయ, గరుత్మంత, నవగ్రహ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 25వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే మహోత్సవాలకు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి, పరిపూర్ణానందసరస్వతీస్వామి, హైదరాబాద్‌కు చెందిన రామాయణ ప్రవచన సుధాకర మైలవరపు శ్రీనివాసరావు తదితర ప్రముఖులు హాజరవుతున్నారని వెల్లడించారు.

మండల మీట్ వాయిదా

కోవెలకుంట్ల: సంజామల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల మీట్ నిర్వహణకు కావాల్సిన కోరం లేకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశామని, తిరిగి జరిపే తేదీని మళ్లీ ప్రకటిస్తామని చెప్పారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని కొమ్మూరు కొట్టాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. రోజుకు సగటు వేతనం రూ. 257 వేతనం పడేలా పని చేయాలని, పని ప్రదేశం వద్ద రెండు సార్లు హాజరు తీసుకోవాలని సూచించారు.

చౌడేశ్వరీదేవి ఆలయానికి రూ.46.20లక్షల ఆదాయం



అమ్మవారి చీరలను పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి శేష వస్త్రాలు(చీరలు)పోగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగవేలం ద్వారా ఆలయానికి రూ.46.20లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ వేలంలో మొత్తం ఆరుగురు పాటదారులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. తిరుపతయ్య అనే పాటదారుడు అత్యధికంగా రూ 46.20లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. గత సంవత్సరం సంవత్సరం కంటే ఈ ఏడాది సుమారు రూ 6.20లక్షల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. కాగ తాము దక్కించుకున్న వేలంతో పాటు అదనంగా 11 శాతం జీఎస్టీ చెల్లించాలని ఆలయ అధికారులు నిబంధనలు పెట్టడడం జరిగింది. అయితే పాటదక్కించుకున్నవారితో 5 శాతం మాత్రమే జీఎస్టీ కట్టించుకోవడంతో వేలంలో పాల్గొన్న పాటదారులు ఈఓతో వాగ్వాదానికి దిగారు. తమకు జీఎస్టీ చెల్లించే విషయంపై సరియైన సమాచారం ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



పాడి రైతులకు నగదు అందజేస్తున్న విజయ డెయిరీ మేనేజర్ పీవీ మధుసూదన్‌బాబు

బనగానపల్లెరూరల్: బనగానపల్లె విజయ డెయిరీ యూనిట్ పరిధిలోని టంగుటూరు, అప్పలాపురం సొసైటీల్లోని పాడి రైతులకు బోనస్ మంజూరు కావడంతో ఆ సంస్థ బనగానపల్లె యూనిట్ మేనేజర్ పీవీ మధుసూదన్‌బాబు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టంగుటూరు ఆదర్శ సొసైటీలోని మొత్తం 102 మంది సభ్యులకు రూ.1,25, 000, అప్పలాపురం సొసైటీలోని 16 మందిపాడి రైతులకు రూ.42, 200 అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో విజయ డెయిరీ సంస్థకు పాలు పోసిన రైతులకు లీటర్‌కు రూ.2 ప్రకారం బోనస్‌ను ప్రోత్సాహకంగా అందజేశామన్నారు.

ఎమ్మెల్యే కాటసానిని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

బనగానపల్లెరూరల్: ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థులైన ఎంవీ రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రనాథ్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణానిధిమూర్తి తెలిపారు. గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మర్యాదపుర్వకంగా కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్, జీఎల్ పదోన్నతులు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కరుణానిధిమూర్తి కోరారు. కార్యక్రమంలో నంద్యాల పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాంపుల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: స్వల్ప కాలిక ఉపాధి శిక్షణ కోర్సులు ప్రారంభమైనందున, నిరుద్యోగ యువంత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. తన కార్యాలయంలో గురువారం బీపీ శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం అధికారులతో ఉపాధి అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శిక్షణా కేంద్రంలో మూడు నెలల స్వల్ప కాలిక కోర్సుల కింద జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్పర్స్ కోర్సులను ప్రాంభించనున్నామన్నారు. ఈ కోర్సుకు బీఎస్సీ, బికాం, బి.టెక్ నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు కాటసాని పరామర్శ



నరసింహారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు కుటుంబాలను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం పరామర్శించారు. స్థానిక మారెమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న గుద్దేటి రామచంద్రారెడ్డి పది రోజుల క్రితం ప్రమాదశాత్తు కింద పడి కాలు విరిగి నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే డిశ్చార్ అయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని ఆయన స్వగృహానికి చేరుకుని ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. అలాగే కటికం వీధికి చెందిన గోపిరెడ్డి నరసింహారెడ్డి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందటంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీనాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రేవనూరు హరినాథరెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు' దుష్ప్రచారాన్ని ఖండించాలి



ఈనాడు పత్రికలను కాల్చివేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఈనాడు పత్రికను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బనగానపల్లె: గన్నవరంలో జరిగిన సంఘటనపై ఎల్లోమీడియా ఈ నెల 21న అవాస్తవాలను ప్రచురించిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి ఎదుట రహదారిపై ఈనాడు పత్రికలను తగలబెట్టారు. ఈనాడుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం కృష్ణజిల్లా గన్నవరం టీడీపీ కార్యాలయంలో సీఎం, మంత్రులు, శాసన సభ్యులు, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులపై పత్రికల్లో రాయలేని విధంగా టీడీపీ నాయకులు అసభ్యంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీవారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కొందరు టీడీపీ నాయకులు వారి అనుచారులతో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయడంతో పాటు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సీఐ కనకారావుపై కిరాతకంగా ప్రవర్తించి హత్యాయత్నానికి ప్రయత్నించారన్నారు. అయితే టీడీపీకి చెందిన పట్టాభిని కొట్టడడంతో పాటు పలు విధాలుగా హింసించిన్నట్లు ఈనాడు పత్రిక పాతఫోటోలతో ప్రచురించడం సిగ్గు చేట్టన్నారు. ఈ వార్త అవాస్తమని పాతఫోటోలతో ప్రచురించడం జరిగిందని ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు)సజ్జల రామకృష్ణారెడ్డి బయటపెట్టారని గుర్తు చేశారు. టీడీపీని అధికారంలోకి తేవాలని ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ–5 తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్న ఎల్లోమీడియాను ప్రజలు స్వచ్ఛందా నిషేధించాలని ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి,జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ,మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జీటీ వెంకట్రామిరెడ్డి, సురేష్, కంబగిరి, మహబూబ్‌వలి, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంబటి రవి కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బాలు, ఈసారి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్వ లేకనే ప్రభుత్వంపై అసత్య ప్రచారం

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పారదర్శక, జన రంజక పాలన చూసి ఓర్వలేకనే ఎల్లో మీడియా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విషం కక్కుతుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ విమర్శించారు. టీడీపీ నేత పట్టాభిరామ్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు పాత ఫోటోలతో ఈనాడు పత్రిక ప్రచురించడం దారుణన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికల యజమాన్య వైఖరిని నిరసిస్తూ ఆ పత్రిక ప్రతులను గురువారం సాయంత్రం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు పత్రిక యజమాన్యాలు సిగ్గు, శరం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ రెండు పత్రికలను ప్రజలు స్వచ్ఛందగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, సచివాలయాల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, దారా హరినాథ్‌రెడ్డి, ఆర్ట్ రమణ, వైయస్సార్‌సీపీ నాయకులు మహేంద్ర, దుబాయ్ శ్రీను, వంశీ, వెంకటేష్, ఎల్లేశ్వర్, రంగస్వామి, హరి, హరీష్, మేకలరాజు, మేడా రఘు, బోయ రంగస్వామి, డీలర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్యాయత్నం

కోవెలకుంట్ల: స్థానిక రంగరాజు పేటకు చెందిన ఓ మహిళ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన చంద్రకళ పట్టణంలో కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. వ్యాపార నిమిత్తం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసింది. అప్పుదారుల నుంచి ఒత్తిడి అధికం కావడంతో మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుంది. గమనించిన చుట్టుపక్కల వ్యక్తులు మంటలార్పి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వీఆర్ లాడ్జి యాజమాని మృతి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని వీఆర్‌లాడ్జి యాజమాని వీఆర్ నాగిరెడ్డి(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నాగిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో న్యాయవాది రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

బనగానపల్లెరూరల్: మండలంలోని చిన్నరాజు పాళెం తాండ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్‌నాయక్, అతని కుమారుడు శివరామకృష్ణనాయక్‌లపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఎం కృష్ణా నాయక్, శ్రీనివాసనాయక్ మధ్య మన స్పర్ధాలు ఉన్నాయి. ఈ విషయం దృష్టిలో పెట్టుకొని పొలం వద్ద నీళ్లుకట్టుకునే విషయంలో కృష్ణానాయక్ అతని తమ్ముడిపై పైన తెలిపిన ఇద్దరు కలిసి కర్రతో కొట్టి గాయపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు అవకాశం

కొలిమిగుండ్ల: ఇంటర్ మధ్యలో మానేసిన విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి మార్కుల మెమోతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఏప్రిల్‌లో జరగబోయే పరీక్షలకు సంసిద్ధులను చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఫీజులు ఉంటాయన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకు ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ కె.బాబు గురువారం తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహించాలి

ప్యాపిలి: ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాల్లో గర్భిణులను గుర్తించి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులు నితీశ్, వాణిశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 12 వారాలలోపు గర్భిణులను గుర్తించి సచివాలయాల్లో వారికి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి రీడింగ్‌ను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మాలిక్‌బాబా గ్రామోత్సవం



డోన్ టౌన్: శ్రీరామచంద్రమాలిక్ బాబా ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి చిత్రపటానికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. బాబా చిత్ర పటాన్ని అశ్వ వాహన రథంపై ఉంచి కేరళ కళాకారుల మంగళ వాయిద్యాల మధ్య పట్టణ పురవీధుల గుండా అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాలిక్‌బాబా సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు మర్రి కృష్ణయ్య, లీగల్ అడ్వైజర్ నరసింహులు, కోశాధికారి రాజు సభ్యులు లక్ష్మినారాయణ, శివ, చలపతిరావు, వెంకటేశ్వర్లు,కాశీరావ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా గోపవరం గోపాల్ రెడ్డి

అవుకు: ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా అవుకు మండలం అన్నవరం గ్రామం ఎంపీటీసీ సభ్యుడు గోపవరం గోపాల్ రెడ్డి గరువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిల సహకారంతో ఎంపీటీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.